దిన పత్రిక
తొలి సమయం
ఆదివారం , 8 - 2 -2026

# తూకాల్లో మోసం ... ఏజెన్సీ రైతులకు వ్యాపారుల కుచ్చు టోపీ

### రిమోట్ కంట్రోల్ తూకాలతో మిర్చి రైతు నిలువు దోపిడీ



**తొలి సమయం కొత్తగూడ 07 ఫిబ్రవరి 2026.**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లడాయిగడ్డ గ్రామంలో మిర్చి రైతు అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారస్తులు ఘోర మోసానికి పాల్పడ్డారు. లడాయిగడ్డ గ్రామానికి చెందిన అర్పపల్లి వీరన్న అనే మిర్చి రైతు వద్ద నుంచి ఐదుగురు సభ్యులు గల ఓ మూట సుమారు రెండున్నర కింటాళ్ల మిర్చిని కొనుగోలు చేసినట్లు నటిస్తూ, రిమోట్ కంట్రోల్ సహాయంతో కేవలం కింటన్నరగా మాత్రమే తూకం వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మిర్చి తూకం పూర్తయ్యాక, జగదీష్ అనే స్థానిక రైతు వద్ద మిర్చి కొనుగోలు చేస్తున్నామని అక్కడికి రావాలని వీరన్నకు చెప్పిన వారు, అతడు అక్కడికి చేరుకునేలోపే మాయమయ్యారు. అనంతరం జగదీష్ ఇంటికి చేరుకున్న వీరన్నకు మోసం జరిగిన విషయం అర్థమైంది. వెంటనే ఆటో కోసం వెతుకుతూ బయలుదేరిన వీరన్న, కొత్తగూడ మండలం గుంజేడు సమీపంలో ఆ ఆటోను ఛేజ్ చేసి పట్టుకున్నాడు. రైతు మోసాన్ని గ్రహించిన స్థానికులు వారిని నిలదీయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. చివరకు వారు బ్రతిమలాడటంతో, మానవతా దృష్టితో రైతులు వారి వద్ద ఉన్న కాంటాను స్వాధీనం చేసుకుని వారిని వదిలిపెట్టినట్లు సమాచారం. ఏజెన్సీ ప్రాంతాల్లో రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారస్తులు ధాన్యం, మొక్కజొన్న, మిర్చి వంటి పంటలను రిమోట్ కంట్రోల్ తూకాల ద్వారా భారీగా తక్కువ చూపిస్తూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న వారిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నిరుపేదలకు అండగా శ్రేష్ట్ ఫౌండేషన్ సేవలు



**తొలి సమయం కొత్తగూడ 07 ఫిబ్రవరి 2026**

గూడూరు మండలంలోని గుండెంగ గ్రామంలో నిరుపేదలు, క్యాన్సర్ బాధితులకు శ్రేష్ట్ ఫౌండేషన్ చేయూతనందించింది. హైదరాబాద్‌కు చెందిన మాజీ మంత్రి ముఖేష్ గౌడ్, ఆయన కుమారుడు విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రేష్ట్ ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది. శ్రేష్ట్ ఫౌండేషన్ ప్రధానంగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయడంతో పాటు ఆర్థిక సహాయం అందిస్తోంది. ముఖేష్ గౌడ్ జయంతి (జులై 1) మరియు వర్ధంతి (జులై 29) సందర్భాల్లో ఈ సేవలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అదేవిధంగా, శ్రేష్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఎల్‌బి స్టేడియంలో ముఖేష్ గౌడ్ మెమోరియల్ మల్ల యుద్ధం (కుస్తీ) పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నారు. యువత విద్య, ఉపాధి లక్ష్యంగా 'బిల్డింగ్ బ్రైట్ ఫ్యూచర్స్' వంటి కార్యక్రమాల ద్వారా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అంతేకాకుండా దేవాలయాల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో కూడా ఫౌండేషన్ చురుకుగా పాల్గొంటోంది. ఇటీవల గుండెంగ గ్రామానికి చెందిన ముత్యాలమ్మ తండా నివాసి భూక్యా వంశీ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న శ్రేష్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, భూక్యా బద్దు నాయక్ సహకారంతో రూ.10,000 నగదు సహాయం తో పాటు పౌష్టికాహారంగా పండ్లను అందజేశారు. అలాగే చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామం ఎర్రగడ్డ తండాకు చెందిన జగదీశ్వరి తండ్రి తిరుపతి క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకుని, ఆయన కుటుంబానికి కూడా రూ.10,000 నగదు సహాయం తో పాటు పండ్లను పంపిణీ చేశారు. తమ కష్టకాలంలో గుర్తించి ఆర్థిక సహాయం అందించిన శ్రేష్ట్ ఫౌండేషన్ నిర్వాహకులకు బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిపిఆర్ఓ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం



**తొలి సమయం శ్రీరంగాపూర్ ఫిబ్రవరి 7**

శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఈరోజు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత, బాల కార్మికుల నిర్మూలన వ్యవస్థపై మహిళల్లో రక్తహీనత, నర్సాముక్త భారత్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్ ,గంజాయి, కొకైన్ లాంటి మాదకద్రవ్యాల దుర్వినియోగం తదితర అంశాల పట్ల కళాకారులు పాటలు పాడి ప్రజలను చైతన్యం చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కళాజాత బృందం టీం లీడర్ ఎం సువర్ణ. ఎస్ శ్రీనివాసులు, డప్పు నరసింహ జి.శివలింగం డి కృష్ణయ్య, ఎం రాధా, ఎస్ శ్రీదేవి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# నీతి - నిజాయితీ,రాజకీయ విలువలు, సేవ దృక్పథం ఉన్న న్యూడెమోక్రసీ అభ్యర్థులను గెలిపించండి

### ప్రశ్నించే గొంతులను ప్రజలే కాపాడాలి

### ఇల్లందు మున్సిపాలిటీ ఎన్నికలలో న్యూడెమోక్రసీ నాయకుల ప్రచారం





**తొలి సమయం, ఇల్లందు;ఫిబ్రవరి, 07.**

ఇల్లందు మున్సిపాలిటీ ఎన్నికలలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అభ్యర్థుల ను గెలిపించాలని కోరుతూ న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు ఇంటిఇంటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారం కార్యక్రమంని ఉద్దేశించి న్యూడెమోక్రసీ మహబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గౌని ఐలన్న, ఇల్లందు డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ తుపాకుల నాగేశ్వరావు, పట్టణ కార్యదర్శి కామ్రేడ్ రాసుద్దీన్, మండల సహాయ కార్యాదర్శి మోతిలాల్ మాట్లాడుతూ,నీతి, నిజాయితీ, సేవ దృక్పథం, రాజకీయలలో విలువలు ఉన్న ఏకైక విప్లవ పార్టీ న్యూడెమోక్రసీ పార్టీ అని, న్యూడెమోక్రసీ అభ్యర్థులు అభివృద్ధి కోసం, పోరాటాలు చేసారని, ప్రజల కష్ట సమయంలో ప్రజల వెన్నంటి ఉన్నారని, కరోనా సమయంలో ప్రజలను మనోధైర్యం ఇచ్చి ఆదుకున్నారని, 9వ వార్డ్ రెల్ల నాగలక్ష్మి పారిశుధ్య, ప్రగతి లో, అభివృద్ధిలో ముందు ఉన్నది అని, మళ్ళీ ప్రజల ఆశీర్వాదంతో 4వ సారి పోటీలో నిలబడింది అని ,గత 10 సంవత్సరాల నుండి ఇల్లందు మున్సిపాలిటీ ని అధికార పార్టీ బి ఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే పాలించింది అని, అయినా ఇంకా సమస్యలు ఎందుకు పరిష్కారం చేయలేదని, అభివృద్ధి ఎందుకు కాలేదని అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని, ఇంతకు ముందు కోరం కనకయ్య , తరువాత హరిప్రియ అధికారం కోసం పార్టీలు మారిన ఇల్లందు పట్టణం అభివృద్ధి చెందలేదని, అందుకే బి ఆర్ ఎస్,కాంగ్రెస్ లను ఓడించాలని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేస్తూ, ప్రజల కోసం నిస్వార్థం గా నీతి, నిజాయితీ గా పోరాడే న్యూడెమోక్రసీ అభ్యర్థుల ను గెలిపించాలని, ఇల్లందు పట్టణ ప్రజలు, మేధావులు ఒక సారి ఆలోచించి ఓటు వేయాలని, అధికార, ప్రతిపక్ష పార్టీలు డబ్బులు, మందు, మాంసం తో ప్రజల ముందుకు వస్తున్నారని, మేము నిస్వార్థం గా పోటీలో ఉన్నాము అని, 1వ వార్డ్ లో కామ్రేడ్ వెంకట నరసయ్య, 2వ వార్డ్ లో వంగ ఉపేంద్ర, 9వ వార్డ్ లో రెల్ల నాగలక్ష్మి గారి కత్తెర గుర్తుకు ఓటు వేయాలని, మీ అమూల్య మైన ఓటు తో ప్రశ్నించే గొంతు ను, పోరాడే విప్లవ శక్తులను కాపాడుకువాలని కోరారు. ఈ కార్యక్రమం లో 1వార్డ్ అభ్యర్థి గణప్వారపు వెంకట నరసయ్య, 2వ వార్డ్ అభ్యర్థి వంగ ఉపేంద్ర,తుపాకుల నాగేశ్వరావు, పట్టణ నాయకులు మండల వెంకన్న, రాశాల లింగం, మోకాళ్ళ రమేష్, మండల వీరయ్య, కోరస రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిసారి డబ్బే కాదన్నా... ఒక్కసారైనా ధర్మం గెలవాలి



### - 21వ వార్డు అభివృద్ధే లక్ష్యంగా కడారి నటరాజ్ ప్రచారం

**తొలి సమయం,ఇల్లందు;ఫిబ్రవరి, 07:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇల్లందు ,21వ వార్డులో స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థిగా కడారి నటరాజ్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. “ప్రతిసారి డబ్బే కాదన్నా ఒక్కసారైనా ధర్మం గెలవాలి” అనే నినాదంతో ప్రజల మధ్యకు వెళ్లి, వార్డు సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా ప్రతి వీధి, ప్రతి బస్తీలో ప్రజలను నేరుగా కలిసి సమస్యలు తెలుసుకుంటూ, పిలిస్తే పలికే ప్రతినిధిగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను 21వ వార్డులోనే పుట్టి పెరిగిన వ్యక్తినని, ప్రజల కష్టసుఖాలను దగ్గరగా చూసినవాడినని తెలిపారు. తన తండ్రి కీశే కడారి యాకయ్య (నాగి) ఇల్లందు మున్సిపాలిటీలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తూ సంవత్సరాల తరబడి ప్రజలకు తాగునీరు అందించారని గుర్తు చేశారు. ప్రజల నమ్మకమే తన తండ్రి సంపాదించిన అసలైన సంపద అని పేర్కొంటూ, అదే నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన రాజకీయ లక్ష్యమని అన్నారు. గత 15 సంవత్సరాలుగా రాజకీయ కార్యకర్తగా ప్రజా సమస్యలపై పోరాటం చేశానని, అలాగే గత 5 సంవత్సరాలుగా పత్రిక విలేకరిగా ప్రజల సమస్యలను వార్తల రూపంలో వెలుగులోకి తీసుకువచ్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లానని కడారి నటరాజ్ తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిరిగే రాజకీయాలు కాదు, ప్రజల వద్దే ఉండే పాలన కావాలని చెప్పారు. ప్రతి వారం ఒక రోజు వార్డు ప్రజా దర్శనం నిర్వహించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వింటానని తెలిపారు. భయపడటం కాదు, ప్రశ్నించటమే తన నైజమని అన్నారు. 21వ వార్డుకు ఎస్సీ (జనరల్) రిజర్వేషన్ రావడంతో ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేసే అవకాశం లభించిందని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, పరిశుభ్రతతో పాటు వృద్ధులు, మహిళలు, యువత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. వృద్ధులు, మహిళలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి పనులు వారి దగ్గరకే తీసుకెళ్లే విధంగా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి అభ్యర్థి ఏ పార్టీ వాడో చూడకండి, ఏపాటు పని చేయగలవాడో చూడండి అని కోరారు. డబ్బు సంచులతో వచ్చే వారిని కాకుండా, ప్రజల మధ్య ఉండే వ్యక్తిని ఈసారి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ 21వ వార్డు ఓటర్లు సీరియల్ నెంబర్ 5లో ఉన్న ఫుట్‌బాల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతో మాత్రమే మున్సిపాలిటీ అభివృద్ధి చెందటానికి మార్గం



### 2, 4,19వ వార్డుల ప్రచారంలో మద్దినేని స్వర్ణకుమారి, మల్లిబాబు యాదవ్

**తొలిసమయం,ఏదులాపురం;ఫిబ్రవరి, 07**

అధికార పార్టీ కి చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే ప్రభుత్వం నుండి అధిక నిధులు రావడం జరుగుతుందని, స్థానిక మున్సిపాలిటీ అభివృద్ధి జరుగుతుందని, కావున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించవలసిందిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మల్లి బాబు యాదవ్ ఓటర్లను ఉద్దేశించి పిలుపునిచ్చారు. తొలిసారి జరిగే ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచార పర్వం వివిధ రాజకీయపక్షాల నడుమ జోరుగా సాగు తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ అభివృద్ధి మంత్రంతో ప్రచారం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా శనివారం నాడు మద్దినేని స్వర్ణ కుమారి, మల్లి బాబు యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 2,వ వార్డ్ ఏనుగు స్వరూప, 4వ వార్డు బోయిన కుమారి 19వ వార్డు మల్లాది శిరీష ల గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచార కార్యక్రమం ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా 12 గ్రామాలను ఏదులాపురం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయించిన ఘనత గౌరవనీయ మన మంత్రివర్యులు, మనందరి ఆప్తుడు పొంగులేటి శ్రీనన్న వలనే సాధ్యపడిందని తెలిపారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అహంకారంతో, అవినీతితో తెలంగాణ తల్లిని అగౌరవపరిచిందని, పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి తెలంగాణ ఏర్పడక ముందు మూడు లక్షల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పులుగా చూపించి నిలువు దోపిడీ చేసిందని, ఇన్నాళ్లు అభివృద్ధి చేయలేని వారు ఈరోజు వచ్చి అభివృద్ధి చేస్తామంటే నమ్మవద్దని, చేపల చెరువు వద్ద దొంగ జపం చేసిన కొంగ మాదిరిగా బిఆర్ఎస్ ప్రచారం చేస్తుందని ఈ నియోజకవర్గం లో అన్నింటికంటే ఇందిరమ్మ ఇండ్లు ఎక్కువగా మంజూరయ్యాయని, ఎన్నికల అనంతరం రాజీవ్ గృహకల్ప, ప్రాంతాన్ని, గొల్లగూడెం ముత్తగూడెం బారుగూడెం గ్రామాలను శీనన్న ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయడం జరుగుతుందని, ఎర్రజెండా సోదరులు కూడా ఆలోచించాలని, ఏనాటికైనా మత విద్వేషాలకు మనమంతా వ్యతిరేకమేనని, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డుల అభ్యర్థులు ఏనుగు స్వరూప,బోయిన కుమారి, మల్లాది శిరీష, నాయకులు బోయిన సంగయ్య మల్లాది మల్లయ్య, ఏనుగు మహేష్, చేతుల నాగేశ్వరరావు, మెండే వెంకటేష్, వెంకటేష్ యాదవ్ ప్రతాప్ మరియు తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# మడగూడెంలో బాల కుమారస్వామి జాతర గిరిజన సంప్రదాయాల ఉత్సవం





**తొలి సమయం కొత్తగూడ. 07ఫిబ్రవరి 2026**

గంగారం మండలం మడగూడెం గ్రామంలో సుంచ వంశీయుల ఇలవేల్పు, కొంగు బంగారం ఆదివాసీల ఆరాధ్య దైవమైన బాల కుమారస్వామి జాతర ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మడగూడెం కృష్ణ నగర్‌లో సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. జాతరలో భాగంగా 7వ తేదీ ఆదివారం గుడి మెలుగు జాతరతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుంచ వంశీయులు వనం నుండి పవిత్రంగా తీసుకొచ్చిన వస్తువులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మడగూడెం చిలుకల గుట్ట నుండి తీసుకొచ్చిన గద్దెలపై స్వామివారిని ప్రతిష్టించారు. ఈ జాతరలో సుంచ వంశీయుల పెద్దలు సుంచ సారయ్య, చుంచు మహేందర్ ముఖ్యంగా పాల్గొని సంప్రదాయ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. వడ్డెలు, శివ సత్తులు పూనకాలు చేస్తూ స్వామివారి మహిమను చాటే విధంగా భక్తులను ఆశీర్వదించారు. పూనకాల మధ్య జాతర ప్రాంగణం భక్తి భావంతో మార్మోగింది. రెండవ రోజు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బాల కుమారస్వామిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటారు. మూడవ రోజు సంప్రదాయంగా వన ప్రవేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. సుంచ వంశీయుల ఇలవేల్పు అయిన బాల కుమారస్వామి కోర్కెలు తీర్చే దేవుడిగా గిరిజనులు అపార విశ్వాసంతో ఆరాధిస్తారు. మూడు రోజుల పాటు భక్తీ శ్రద్ధలతో పూజలు, పూనకాలు, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ గిరిజన సంస్కృతి వైభవాన్ని ఈ జాతర ప్రతిబింబిస్తోంది. ఈ జాతరకు పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో గిరిజనులు, భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనంతో పుణ్యం పొందుతున్నారు.

# అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా.. 59వ డివిజన్‌లో ఇంటింటికి విస్తృత ప్రచారం

### సిపిఐ అభ్యర్థి ఇమ్రాన్‌కు ఓటర్ నుంచి విశేష స్పందన

### అభివృద్ధికి ఓటేస్తామంటున్న కూలిలైన్ ప్రజలు

### ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్న సిపిఐ శ్రేణులు అస్మద్, అరుణ



**తొలిసమయం, కొత్తగూడెం, ఫిబ్రవరి 07 :**

శనివారం 59వ డివిజన్ సిపిఐ పార్టీ అభ్యర్థి మహమ్మద్ ఇమ్రాన్ డివిజన్ పరిధిలోని కూలిలైన్ ప్రాంతంలో ఇంటింటికి ప్రచారం చేశారు. సిపిఐ శ్రేణులు అరుణ, అస్మద్ ఆధ్వర్యంలో ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ అభ్యర్థి మహమ్మద్ ఇమ్రాన్ గత రెండు సంవత్సరాల కాలంలోసిపిఐ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. అందులో ముఖ్యంగా సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజ్, సెంట్రల్ లైటింగ్ సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని ఆయన్ని ఆదర్శంగా తీసుకుని డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ప్రజలంతా కంకికొడవలి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమాల్, శంకర్, హబీబ్, హేమ, శాకీర్, మునీర్, తదితరులు పాల్గొన్నారు.